క్లుప్తంగా

ప్రథమ చికిత్సే సంజీవని



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ కార్యదర్శి మల్లేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: ఆపద సమయంలో ప్రథమ చికిత్స సంజీవనిలా పనిచేసి తోటివారి ప్రాణాలు కాపాడుతుందని రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, డాక్టర్ శ్రీకాంత్‌లు సీపీఆర్, గాయాలకు కట్టుకట్టడం, పాముకాటు, తేలు కాటు, గుండెపోటు వచ్చినవారికి ప్రథమ చికిత్స, కరెంట్‌షాక్‌కు గురైన వారికి సేవలు అందించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు నిక్కు అప్పన్న, చార్టెడ్ అకౌంటెంట్ వీఎంరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం.కల్యాణ్ చక్రవర్తి, చిన్మయరావు, ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, పి.చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న విష్ణుమూర్తి

జి.సిగడాం: నిద్దాం గ్రామంలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన కెంబూరు చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. గురువారం బాధితురాలి కుటుంబానికి రూ.10 వేల సాయం అందించారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు మీసాల రవికుమార్, మాజీ సర్పంచ్ పైల బాబ్జీ, రామకృష్ణంనాయుడు, వజ్జిపర్తి రఘురాం, పలిశెట్టి సత్యారావు, ఏర్నేన శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోశాలలో విశేష పూజలు



విగ్రహమూర్తులకు పూజలు చేస్తున్న స్వామీజీలు

రణస్థలం: మండలంలోని కోష్టలో గోశాల–గోకులానంద ఆశ్రమంలో శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నాలుగో రోజు గురువారం ఘనంగా జరిగాయి. విగ్రహాల స్నపనం, పంచశయ్యాదివాసం, గీతా, విష్ణు పారాయణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హరేకృష్ణ, హరే రామ కీర్తనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంటోంది. చివరి రోజు శుక్రవారం ఉదయం 11.20 గంటలకు విగ్రహ పతిష్ఠా మహోత్సవం, యజ్ఞ యాగాలు, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

దాడి కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టణ ప్రాంతాలకు గృహ నిర్మాణ కార్మికులను పంపించే పొన్నాడ పంచాయతీ బింగిపేటకు చెందిన బింగి పద్మ.. కుప్పిలి గ్రామం యాతపేటకు చెందిన తాపీమేస్త్రి బందారు సాయికి కొన్ని నెలల క్రితం రూ.2 లక్షలు అప్పు ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని గురువారం అతని ఇంటికి వెళ్లి అడగ్గా.. డబ్బులు ఇవ్వకుండా తనపై దాడి చేశాడని, బెదిరించాడని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఆస్తి గొడవలు నేపథ్యంలో బింగి మధు అనే వ్యక్తి బుధవారం తనపై దాడి చేశాడని పొన్నాడ పంచాయతీ బింగిపేటకు చెందిన సూరపు ఉగాది అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి ఆరోగ్య నివేదిక, బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకానున్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పుష్పాలతో పూజలు చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో గురువారం శ్యామలాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుహాసినీలతో దీపారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రూ.కోట్లలో ఆదాయం.. సౌకర్యాలు శూన్యం



గోదాం ముందు రోడ్డుపైనే లారీల పార్కింగ్

- ఎచ్చెర్లలో బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం వద్ద డ్రైవర్లకు తప్పనిపాట్లు
- పట్టించుకోని పాలకులు



శిథిల మైన వెయిటింగ్ హాల్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం వద్ద కనీస స్థాయిలో కూడా సౌకర్యాలు లేకపోవడంతో డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడి నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సుమారు 210 బార్లు, వైన్ షాపులకు మద్యం సరఫరా చేస్తుంటారు. రోజుకు దాదాపుగా రూ.3 కోట్లు వరకు మద్యం అమ్ముడుపోతుంది. కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా డిపో వద్ద కనీస సౌకర్యాలు లేవు. ఇక్కడికి ఏపీ, తెలంగాణాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఒప్పందం మేరకు కంపెనీల నుంచి లారీలు వస్తుంటాయి. ఒక్కో సారి మద్యం లారీ అన్‌లోడింగ్‌కు పది రోజులు సైతం సమయం పడుతుంది. అన్ని రోజుల పాటూ లారీ డ్రైవర్, సహాయకులకు పాట్లు తప్పడం లేదు. వెయిటింగ్ హాల్, క్యాంటీన్, మరుగుదొడ్లు వంటివి లేక ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక లారీ క్యాబిన్లలోనే నిద్రపోతున్నారు. రాత్రివేళ లారీల కింద పడుకుంటే పాముల భయం, ఒక్కోసారి వేరే వాహనాలు ఢీ కొట్టడం వంటివి జరగటం వల్ల ప్రమాదాల్లో మృతి చెందిన సంఘటనలు సైతం గతంలో చోటుచేసుకున్నాయి. మరోవైపు వీధి లైట్లు కూడా లేవు. ఇక్కడ విస్తారంగా ప్రభుత్వ స్థలం, కొండ ఉంది. నిర్మాణాలకు స్థలం ఉంది. అయినా గోదాం విస్తరించడం లేదు. ప్రస్తుత స్థలం సరిపోకపోవడంతో అన్‌లోడింగ్‌లో జాప్యం జరుగుతుంది. మరో పక్క పార్కింగ్ స్థలం లేకరోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వసతుల కల్పనపై దృష్టి సారించాలని లారీ డ్రైవర్లు, సహాయకులు కోరుతున్నారు.

వారం దాటి నిరీక్షణ



లారీల అన్‌లోడింగ్ వారం దాటిపోతోంది. తాగునీరు వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు వచ్చినా ఇదే సమస్య ఉంటోంది.

– భాస్కరరావు, లారీ డ్రైవర్, అనపర్తి

కనీస సౌకర్యాలు కరువు..



కనీసం పార్కింగ్‌కు సైతం స్థలం కేటాయించ లేదు. రోడ్డుపైనే వాహనాలు ఆపాల్సి వస్తోంది. వీధి లైట్లు కూడా లేవు. రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

– రసూల్, లారీ డ్రైవర్, సింగరాయకొండ

లారీలోనే నిద్ర..



కనీసం విశ్రాంత గది కూడా లేకపోవడంతో లారీలోనే నిద్రపోతున్నాం. వీధి లైట్లు కూడా లేకపోవడంతో నిరంతరం కాపలా కాయాల్సి ఉంటోంది. ఎప్పుడు అన్‌లోడ్ అని ప్రశ్నిస్తే గోదాంలో స్థలం లేదని చెబుతున్నారు.

– రాంజీనాయక్, లారీ డ్రైవర్, ఒంగోలు

సకాలంలో చార్జిషీట్ దాఖలు చేయాలి

- ముఖ్య కూడలిలో సీసీ కెమెరాలు తప్పనిసరి
- పోలీసు అధికారులకు ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశం



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో కేసులలో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి చార్జిషీట్లను నిర్ణీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని, ఆయా వివరాలను పోలీస్ సీసీటీఎన్‌ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్పీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారికి అనుసంధానమైన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపార, గృహ సముదాయాలు, శివారు ఇళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, డయల్ 100, 112 ద్వారా స్వీకరించే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గస్తీ నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల వద్ద పెట్రోలింగ్ చేస్తూ విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులు, దివ్యాంగుల సంక్షేమం ప్రధానమని, ప్రభుత్వ పథకాలను వారి వద్దకే వెళ్లి అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాల బాలికలు, దివ్యాంగుల సంరక్షణలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్‌పై న్యాయసేవాధికార కార్యాలయంలో సమీక్షించారు. ఆరోగ్య సమస్యలు గుర్తించడం, వాటికి సత్వర చికిత్స అందించడంపై చర్చించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ.వెంకట్, మేనేజర్ డి.అప్పలనాయుడు, డీసీపీఓ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రగతితోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పి.టి.తులసి

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా సాధికారితతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయం సోషల్ వర్కు విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ పి.టి.తులసి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం 'మహిళా సాధికారిత జీవనోపాధి' అనే అంశంపై సోషల్ వర్కు విభాగం, సావిత్రిబాయి పూలే సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, ఉన్నత భారత్ అభియాన్ సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు సైతం మహిళలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్ కార్యాలయంలో విచారణ నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 35 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపుపై అందిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలిలోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు విచారణ నిర్వహించనున్నారు. గత ఏడాది డిసెంబర్ 31న ఉద్యోగులను తొలగించగా జనవరి 2న ఫిర్యాదు చేశారు. జనవరి 9, 25వ తేదీల్లో విచారణ సాగింది. పూర్తిస్థాయి డాక్యుమెంట్లతో హాజరుకావాలని అసిస్టెంట్ లేబర్ కమిషన్ ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఒప్పందం, ప్రభుత్వ నిబంధనలతో కూడిన వివరాలు తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందజేశారు. రోడ్డున పడిన తమకు న్యాయం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బ్రిడ్జి సమీపంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో వీసీ రజని, పీవోలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రజనీ అన్నారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని నాగావళి బ్రిడ్జి నదీతీరం, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జీడీసీ మెన్, మహిళా కళాశాల, కాకినాడ ఆదిత్య విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ అనూరాధ, పీడీ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ శ్రీనివాస్ పాత్రో, డాక్టర్ చలమయ్య, మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ మాధవి, కాకినాడ ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వరూప్‌కు అభినందనలు



స్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ఎం.వి.స్వరూప్ నియమితులైన సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం స్వరూప్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్వరూప్‌ని కలిసిన వారిలో పప్పల రమేష్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా తనను నియమించడం పట్ల ఎం.ఏ.ముజిబుర్ రెహమాన్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి ఎం.ఏ.రఫీ, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.ఏ.బేగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా సాధు వైకుంఠరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడిగా సాధు వైకుంఠరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వైకుంఠరావును అభినందించారు.


న్యాయవాది వృత్తిలో సాఫ్ట్‌స్కిల్స్ అవసరం



సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కిరణ్

శ్రీకాకుళం పాత బస్టాండ్: యువ న్యాయవాదులు మారుతున్న కాలంతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని, ప్రస్తుతం న్యాయవ్యవస్థలో సాఫ్ట్ స్కిల్స్ అవసరమని ట్రైనర్ కిరణ్ ఆగూరు అన్నారు. గురువారం నగరంలోని ఎంపీఆర్ న్యాయ కళాశాలలో వర్కుషాపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోషే, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెకు ఆర్‌యూపీపీ మద్దతు



గాదె శ్రీనివాసులనాయుడుకు సంఘీభావం తెలుపుతున్న ఆర్‌యూపీపీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాదె శ్రీనివాసులనాయుడుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ–ఏపీ) అధ్యక్ష కార్యదర్శులు పిట్ట గంగన్న, కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జి.మల్లేసు, కనుమెట్ట పద్మావతి గురువారం తెలిపారు. డీఈఓ పూల్‌లో పండితుల పదోన్నతులు పొందాలంటే గాదెతోనే సాధ్యమౌతుందన్నారు. ఈ నెల 7న విశాఖలో జరిగే గాదె నామినేషన్ ప్రక్రియలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌యూపీపీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కిరణ్



వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు ఉన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలవాలని తెలియజేసినట్లు కిరణ్ చెప్పారు.

– రణస్థలం

టాలెంట్ టెస్ట్‌కు స్పందన



పొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ ఆర్మీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 39 మంది విద్యార్థులు హాజరుకాగా.. గంటేటి పృథ్వీరాజ్, సాధు పూజిత, పొన్నాడ హాసిని తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి స్టడీ మెటీరియల్‌ను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.అమ్మాజీ, నాయకులు అల్లు తులసీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ముక్కు మూసుకోవాల్సిందే....



గార మండలంలోని రెండో అతి పెద్ద పంచాయతీ అంపోలులో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. కళింగపట్నం– శ్రీకాకుళం ప్రధాన రహదారి నుంచి అంపోలు మీదుగా జాతీయ రహదారికి వెళ్లే దారిలో అంపోలు కాలనీ వద్ద రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– గార

హెల్మెట్‌తో ప్రాణరక్షణ



హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు రక్షించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికుల్ని కోరారు. ఈ మేరకు గురువారం నగరంలో వినూత్న పద్ధతిలో గులాబీ పూలను అందజేసి హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాల్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పలు సూచనలిచ్చారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఘనంగా విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవమూర్తుల కల్యాణం



విజయగణపతికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: న్యూకాలనీలోని బాలాజీ అపార్టుమెంట్స్ వద్ద విజయగణపతి ఆలయ 6వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి పవన్‌కుమార్ శర్మ, రామ్మోహన్‌రావు శర్మ ఆధ్వర్యంలో మండప పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సిద్ధి బుద్ధి సమేత విజయగణపతి ఉత్సవమూర్తుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



వైద్యులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులతో డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: నేటి ఆధునిక యుగంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానంలో ప్రతీ మహిళ సర్వైకల్ వాక్సిన్ వేసుకోవడం తప్పనిసరని ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో అంతర్జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా జెమ్స్ ఆసుపత్రి వైద్యులతో కలిసి గురువారం గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించిన కొత్త కేసులు ఆందోళనకరమైన రేటుతో పెరుగుతున్నాయని వివరించారు. ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన హ్యూమన్ పాపిల్లోమా వైరస్‌కు వ్యతిరేకంగా సాధారణ టీకాలు వేయడం వల్ల చాలా కేసులను నివారించవచ్చనని వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఈసందర్భంగా 100 మంది విద్యార్థినులకు సర్వైకల్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేస్తానని శ్రీధర్ ప్రకటించారు. అనంతరం జెమ్స్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఆర్.అరవింద్, డాక్టర్ కె.ప్రశాంతి, డాక్టర్ జి.ప్రమీల తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, వై.రవికుమార్, డాక్టర్ రామారావు, నీరజ, జువాలజీ హెచ్‌ఓడి ఐ.హైమపద్మజ తదితరులు పాల్గొన్నారు.